తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం


ప్రతి అక్షరం ప్రజల కోసం

Published From: Medchal-Malkajgiri | సంపుటి: 5 సంచిక: 93 పేజీలు : 08 | శుక్రవారం 27-3- 2026 వెల: 3 రూ/.

## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

**– ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి**

**– త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక**



**వాషింగ్టన్,:** ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని

2లో..



## ఈజ్ ఆఫ్ లివింగ్‌లో

# భాగ్యనగరానికి అగ్రస్థానం

**– బెంగళూరును వెనక్కి నెట్టిన హైదరాబాద్**

**హైదరాబాద్** హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతూ విశ్వనగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరంలో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన వారు కూడా నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని మెట్రో నగరాలన్నింటిని వెనక్కి నెట్టి 'నివసించడానికి అత్యంత అనుకూలమైన నగరం'గా అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ సంస్థ అన్‌బాక్సింగ్ బీఎల్ఆర్ తాజాగా విడుదల చేసిన 'వీ ఆర్ సిటీ 2026' నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని ఎనిమిది ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ అన్ని రంగాల్లోనూ సత్తా చాటింది. పటిష్టమైన రియల్ ఎస్టేట్ మార్కెట్, సామాన్యుడికి అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఇలా పలు ప్రత్యేకతలు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ఒకప్పుడు బెంగళూరు మాత్రమే ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది, కానీ ఇప్పుడు బెంగళూరు ఆధిపత్యానికి హైదరాబాద్ సవాల్ విసురుతోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.ఈ నివేదిక ప్రకారం హైదరాబాద్, బెంగళూరు నగరాలు కలిసి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జనాభా పరంగా ముంబై, ఢిల్లీ ఎంతో పెద్దవైనప్పటికీ ఆర్థిక వృద్ధిలో మాత్రం ఈ రెండు నగరాలు వాటిని మించిపోతున్నాయి. పదేళ్ల క్రితం దేశంలోని టాప్-8 నగరాల్లో కొత్త కంపెనీల ఏర్పాటులో ఈ రెండు నగరాల వాటా 15 శాతం ఉండగా గత ఆర్థిక సంవత్సరం నాటికి అది 25 శాతానికి పెరిగింది. కార్యాలయాల విస్తరణ, గృహ రుణాల మంజూరు, విమాన ప్రయాణాలు, విద్యార్థుల చదువు వంటి అంశాల్లో ఈ రెండు నగరాలు అగ్రగామిగా

2లో..

## తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు నోటీసులు

**– బీఆర్ఎస్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ**




**హైదరాబాద్** తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ ట్రైబ్యునల్‌తో పాటు అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలపై సభాపతి ట్రైబ్యునల్ చర్యలు

2లో..

# విద్య, వైద్యం మా ప్రభుత్వ ప్రాధాన్యత

**– సీఎం సహాయకనిధికి ఆన్లైన్ దరఖాస్తులతో అక్రమాలకు అడ్డుకట్ట వేశామన్న సీఎం**



**హైదరాబాద్** ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు.


2లో..

# అబుదాబిపై ఇరాన్ క్షిపణి దాడి

**– శకలాలు మీద పడి భారతీయుడి మృతి**

**న్యూఢిల్లీ** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు విషాదానికి దారితీశాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో గురువారం జరిగిన ఓ ఘటనలో ఒక భారత జాతీయుడు ప్రాణాలు కోల్పోయారు. మరొక భారతీయుడు గాయపడ్డారు. గగనతలంలో పేల్చివేసిన బాలిస్టిక్ క్షిపణికి చెందిన శకలాలు జనావాసాలపై పడటంతో ఈ ఘోరం జరిగింది. ఈ దుర్ఘటనలో మొత్తం ఇద్దరు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనపై అబుదాబి మీడియా ఆఫీస్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు

2లో..



## ఒకే గొడుగు కిందకు

# రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు

**– తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**




**హైదరాబాద్** భూముల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ తప్పుల తడకగా ఉందని ఉన్న సమస్యలు తీర్చడం సంగతి అటుంచితే కొత్త సమస్యలను తెచ్చిపెట్టిందని కాంగ్రెస్ పార్టీ ముందు నుంచీ ఆరోపణలు చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయోగాత్మకంగా మొదట పైలట్ ప్రాజెక్టు కింద 5 మండలాల్లో అమలు చేయనుంది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల (ఏప్రిల్) 2వ తేదీ నుంచి ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను అమలు చేయనున్నట్లు తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తాజాగా స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రయోగాత్మకంగా 5 మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. నారాయణపేట జిల్లాలోని కోస్గి మండలం రంగారెడ్డి జిల్లాలోని అమన్‌గల్ మండలం

2లో..

## అసెంబ్లీని నడపలేక ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది

**– ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేకనే కేటీఆర్ విమర్శ**



**హైదరాబాద్** ప్రభుత్వం సభను నడపలేక క్రీడా పోటీల ఎత్తుగడ వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన పిచ్చాపాటిగా మాట్లాడుతూ, సభలో కీలకమైన అంశాలపై చర్చను పక్కన పెట్టేందుకు ప్రభుత్వం ఆటల పోటీలకు తెరతీస్తోందని విమర్శించారు. ఇరిగేషన్ వంటి కీలక పద్దులపై చర్చలు కొనసాగుతుండగా ఆటల పోటీలు ఎందుకని ప్రశ్నించారు. ఇదే అంశాన్ని తాను అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి

2లో..

## అవసరాలకు అనుగుణంగా

# ఎంఎంటీఎస్ సర్వీసులు

**– ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచాలన్న సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్** హైదరాబాద్ నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లు అంటే తెలియని వారు ఉండరు. నగరంలో చాలా దూరం ప్రయాణించినా అతి తక్కువ టికెట్ ధరతో ఈ ఎంఎంటీఎస్ రైళ్లలో దూసుకెళ్లిపోవచ్చు. ట్రాఫిక్, అధిక ఖర్చు లేకుండా వెళ్లొచ్చు. అయితే ఎంఎంటీఎస్ రైళ్లతో వచ్చిన అతిపెద్ద సమస్య ఏంటంటే సమయానికి రైళ్లు రావు. మరోవైపు ఎంఎంటీఎస్ రైళ్లు నడిచే రైల్వే స్టేషన్‌లకు బస్‌స్టాప్‌ల మధ్య సరైన కనెక్టివిటీ లేకపోవడం వల్ల కూడా వాటిని ఉపయోగించుకునే వారి సంఖ్య అంత పెద్దగా ఉండటం లేదు. దీనివల్ల హైదరాబాద్ నగర వాసులు మెట్రో, బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో రోడ్లపైనా ట్రాఫిక్ భారీగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సర్కార్ ఎంఎంటీఎస్ సేవలను నగరవాసులకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎంఎంటీఎస్ సర్వీసులకు సంబంధించి శాసనమండలి హాల్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్

2లో..

# ఘోర బస్సు ప్రమాదం

**– 13 మంది సజీవ దహనం – సీఎం చంద్రబాబు,లోకేష్ తో పాటు మంత్రుల దిగ్భ్రాంతి**



**అమరావతి** గురువారం ఉదయం మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా వణికించింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి 35 మందితో వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఆ ప్రైవేటు బస్సు రాయవరం సమీపంలోకి రాగానే పలకల క్వారీ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనం అయ్యారు. మరో 22 మందికి తీవ్ర గాయాలు అయినట్లు అధికారులు వెల్లడించారు. వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అయితే ఈ బస్సు ప్రమాదం బాధిత కుటుంబాలకు అంతులేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఇప్పటి దాకా 13 మంది మృతదేహాలను బయటికి తీశారు. ఇక ఈ బస్సు ప్రమాదానికి సంబంధించి తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బస్సు కండీషన్ సరిగా లేదని ప్రమాదానికి ముందే అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

2లో..

# నిల్వలు ఉన్నా ఇంధన సెగ

**– హైదరాబాద్‌లో పెట్రోల్ కష్టాలకు కారణం ఎవరు.?**

**హైదరాబాద్** హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటం సామాన్య వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని అటు కేంద్ర పెట్రోలియం శాఖ, ఇటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చెబుతున్నప్పటికీ, బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రభుత్వ లెక్కల్లో నిల్వలు పుష్కలంగా ఉన్నా, అవి వినియోగదారుడి వాహనం దాకా చేరకపోవడమే అసలు సమస్యగా మారింది. నిల్వలు ఉన్నప్పటికీ బంకులకు చేరకపోవడానికి ప్రధాన కారణం 'సప్లై చైన్' లేదా రవాణా

2లో..



అక్షరగళం
శుక్రవారం, మార్చి 27, 2026

# ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది (ఎసజీని జా ఇనీన్గా÷తిఇబి). ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

## ఈజ్ ఆఫ్ లివింగ్‌లో భాగ్యనగరానికి అగ్రస్థానం

ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా దేశంలోని అత్యంత ధనిక జిల్లాల్లో ఒకటిగా నిలిచింది. ఆఫీస్ స్పేస్ అద్దె విషయానికి వస్తే బెంగళూరుకు హైదరాబాద్ కేవలం 15 శాతం దూరంలోనే ఉంది. కొత్త కంపెనీల ఏర్పాటులో బెంగళూరుతో హైదరాబాద్ సమంగా నిలవడం విశేషం. అయితే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు, సోషల్ ఈవెంట్స్, వినోదంపై పెట్టే ఖర్చుల విషయంలో బెంగళూరు నగరవాసులు ముందుండగా హైదరాబాద్ ప్రజలు గృహ నిర్మాణం వంటి సంప్రదాయ పెట్టుబడులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.అభివృద్ధి ఎంత ఉన్నా రవాణా విషయంలో రెండు నగరాలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ఆ రిపోర్టు వెల్లడించింది. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా ఉంది. హైదరాబాద్‌లోనూ ఐటీ కారిడార్లలో ఆఫీసులకు వెళ్లే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. బెంగళూరు కంటే హైదరాబాద్‌లో వాహనాల వేగం 20 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రయాణ సమయం మాత్రం దాదాపు సమానంగా ఉండటం గమనార్హం. ఈ రిపోర్టు ప్రకారం మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాల మెరుగుదలతో హైదరాబాద్ ఇప్పుడు దేశానికే తలమానికంగా, బెస్ట్ సిటీగా నిలిచింది.

## తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు నోటీసులు

తీసుకోలేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వారు బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి మారారని కోర్టుకు తెలిపారు. అయినప్పటికీ స్పీకర్ చర్యలు తీసుకోలేదని అన్నారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే పార్టీ మారిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## విద్య, వైద్యం మా ప్రభుత్వ ప్రాధాన్యత

శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను తెలిపారు.'రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నాం. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోంది'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా సగటున రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది. ఆ భారాన్ని మోస్తూనే రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించాం. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 54 కోట్లు అందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు. గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ. 100 కోట్లు మాత్రమే. ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ. 496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 231.44 కోట్లు ఉంది'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.'రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందే. అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించాం. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి'అని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రకటించారు.'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుంది. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రకటించారు. 'పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నాం. వైద్యులకే హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయి. అందుకని నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు తల్లిదండ్రుల కోసమో, ఇతర పనుల కోసం రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను క్రియేట్ చేస్తున్నాం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అబుదాబిపై ఇరాన్ క్షిపణి దాడి

ఓ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డగించి కూల్చివేశాయని తెలిపింది. అయితే, ఆ క్షిపణి శకలాలు అబుదాబిలోని స్వీహాన్ వీధిలో పడ్డాయని పేర్కొంది. ఈ ప్రమాదంలో ఒక భారత, ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించారని ధృవీకరించింది. గాయపడిన ముగ్గురిలో ఒక యూఏఈ, ఒక జోర్డాన్, ఒక భారత జాతీయుడు ఉన్నారని, వారికి చికిత్స అందిస్తున్నామని వివరించింది.

ఈ ఘటనలో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28 నుంచి మొదలైన ఘర్షణల పర్యవసానంగానే ఈ దాడులు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. పశ్చిమాసియాలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలు, వారి మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగుతోంది. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వినిపిస్తున్న భారీ శబ్దాలు క్షిపణులను అడ్డగించడం వల్లే వస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ప్రజలు అనవసరపు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అబుదాబి అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అసెంబ్లీని నడపలేక ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది

తీసుకువెళ్లానని, కానీ ఆయన వద్ద సమాధానం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రజాసమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ప్రజాప్రతినిధులు మైదానాలలో ఆటలు ఆడుతుంటే ప్రజలు ఏమనుకుంటారని ప్రశ్నించారు. ఈ నెల 28, 29 తేదీల్లో ప్రభుత్వం క్రీడాపోటీలను నిర్వహించాలని నిర్ణయించిందని, కీలక అంశాలపై చర్చ సమయంలో ఇది సరికాదని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సమావేశాలను ఆటలపోటీల వంటి కార్యక్రమాల పేరుతో వృథా చేయడమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు. పద్దులపై చర్చకు సమయం కేటాయించకుండా సభా సమయాన్ని క్రీడలకు కేటాయించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

### ఒకే గొడుగు కిందకు

# రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు

సంగారెడ్డి జిల్లాలోని వట్‌పల్లి మండలం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలు అందించనున్నట్లు మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు.తాజాగా సెక్రటేరియట్‌లో రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌తోపాటు ఎన్ఐసీ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష చేశారు. ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తయారు చేసినట్లు తెలిపారు. భూములకు సంబంధించి రెవెన్యూ, సర్వే, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లను ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ తీసుకువచ్చినట్లు వెల్లడించారు. భూ లావాదేవీల వివరాలు పూర్తిగా కనిపించే పారదర్శక వ్యవస్థగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను మంత్రి పొంగులేటి అభివర్ణించారు. భూమికి సంబంధించి ప్రతీ ఒక్క సర్వే నెంబర్‌కు మనుషులకు ఆధార్ నెంబర్ లాగానే భూములకు భూదార్ నెంబర్‌లను కేటాయించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ జతచేయడం ఈ 5 మండలాల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేసిన తర్వాత ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులకు సులభంగా సేవలు అందించడం భూ వివాదాలకు పరిష్కారం చూపించే దిశగా ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలక అడుగు అని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

# ఘోర బస్సు ప్రమాదం

ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆ బస్సు పరిస్థితి బాగా లేదని ముందే డ్రైవర్‌తో చెప్పారు. ఈ క్రమంలోనే యర్రగొండపాలెం వద్ద బస్సును గంటసేపు నిలిపేసిన డ్రైవర్ దానికి మరమ్మతులు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. రిపేర్ల తర్వాత బస్సు బయల్దేరి కొంత దూరం వెళ్లిన తర్వాత రాయవరం వద్ద ఈ ఘోర ఘటన జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదం తర్వాత అధికారులు బస్సు డ్రైవర్‌ను విచారణ జరపగా స్టీరింగ్ స్ట్రక్ అయినట్లు చెప్పినట్లు సమాచారం. కానీ ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బస్సు క్లీనర్ మహేంద్ర వాదన మాత్రం మరో రకంగా ఉంది. బస్సు ప్రమాదం నుంచి మొట్టమొదటగా తానే ప్రాణాలతో బయటపడినట్లు తెలిపాడు. తాను నిద్రపోతున్న సమయంలో ప్రమాదం జరిగిందని లేచి చూసేసరికి బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. మంటలను ఆర్పే సిలిండర్లు బస్సులో ఉన్నాయని కానీ దట్టమైన పొగ కారణంగా అవి కనిపించలేదని వివరించాడు. చాలా మంది అద్దాలు పగలగొట్టి బయటపడి ప్రాణాలు రక్షించుకున్నారని తెలిపాడు. బస్సు కండీషన్ బాగానే ఉందని క్లీనర్ మహేంద్ర చెప్పాడు. మరోవైపు ఈ మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఈ ఘటనలో చనిపోయిన వారికి ఏపీ కేబినెట్ సంతాపం తెలియజేసింది. అదే సమయంలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ఇక ఈ ఘోర ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు గాయాల పాలైన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. బాధితులకు మెరుగైన ట్రీట్‌మెంట్ అందించాలని ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాదంపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు ప్రమాదం తీరుపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు అనిత, జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మరోవైపు ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. బస్సు మంటల్లో కాలి బూడిదై అందులో ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదమని మోదీ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఉన్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇక మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మార్కాపురం బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ బస్సు ప్రమాద ఘటనపై ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. ప్రమాదానికి గురైన బస్సు జగిత్యాల నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఇక్కడి ప్రయాణికులు ఎవరైనా ఉన్నారా అనే వివరాలు తెలుసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో తెలంగాణ సీఎస్ మాట్లాడారు.

### అవసరాలకు అనుగుణంగా

# ఎంఎంటీఎస్ సర్వీసులు

కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలను తీర్చే విధంగా ఎంఎంటీఎస్ సర్వీసులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రతీ సంవత్సరం ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పట్టడంపైనా సీఎం ఆరా తీశారు. హైదరాబాద్ నగరంలో ఆఫీస్ వేళల్లో ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్యను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

అదే సమయంలో ఎంఎంటీఎస్ రైళ్లు క్రమం తప్పకుండా నిత్యం సమయ పాలన పాటిస్తూ సర్వీసులను నడపాలని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. అదే సమయంలో ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు నేరుగా చేరుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ బస్సులకు అవకాశం లేకపోవడం ఆయా రైల్వే స్టేషన్లు మెయిన్ రోడ్డు నుంచి లోపలికి ఉన్నందున అక్కడి వరకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని కూడా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రైళ్లలో, రైల్వే స్టేషన్లలో మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ రైళ్ల వైపు మొగ్గు చూపుతారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. సొంతంగా ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రయత్నించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగు పరిచేందుకు ఉన్న అన్ని అవకాశాలపై అధ్యయనం చేసి రిపోర్టు సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఇక తాజాగా సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ హాజరయ్యారు.

# నిల్వలు ఉన్నా ఇంధన సెగ

వ్యవస్థలో తలెత్తిన లోపాలేనని తెలుస్తోంది. చమురు కంపెనీల డిపోల నుండి బంకులకు ఇంధనాన్ని చేరవేసే ట్యాంకర్ల లభ్యత తగ్గడం లేదా రవాణా కాంట్రాక్టర్ల మధ్య తలెత్తిన సమన్వయ లోపం వల్ల సకాలంలో లోడింగ్ జరగడం లేదని చెబుతున్నారు. అయితే ముందుగానే డబ్బులు చెల్లించాలని మార్చిన నిబంధనల వల్ల కూడా.. పెట్రోల్ బంకులకు తగినంత ఇంధనం అందడం లేదనిచెబుతున్నారు.

కొరత ఉందన్న చిన్నపాటి వదంతులు సోషల్ మీడియాలో వ్యాపించగానే, వాహనదారులు తమ అవసరానికి మించి ఇంధనాన్ని నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా రోజూ 5 వేల లీటర్లు అమ్ముడయ్యే బంకులో, ఒకేసారి 15 వేల లీటర్ల డిమాండ్ రావడం వల్ల నిల్వలు త్వరగా అయిపోతున్నాయి.

ఇదే క్రమంలో కొంతమంది బంకు నిర్వాహకులు ధరలు పెరుగుతాయన్న ఆశతో లేదా ముందస్తు జాగ్రత్తగా స్టాక్ ఉన్నా లేదని చెబుతూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. నిల్వలు ఉన్నాయని ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమైన ప్రభుత్వ యంత్రాంగం, క్షేత్రస్థాయిలో తనిఖీలను విస్మరించిందన్న విమర్శలు వస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు బంకుల్లోని నిల్వలను తనిఖీ చేసి, స్టాక్ ఉండి కూడా అమ్మని వారిపై చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. డిపోల వద్ద ట్యాంకర్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేసేలా చమురు కంపెనీలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమవ్వడం వల్లే ఈ అనిశ్చితి కొనసాగుతోంది. ప్రస్తుత సంక్షోభం తొలగాలంటే కేవలం ప్రకటనలు సరిపోవు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపి, ప్రతి బంకులో ఉన్న నిల్వలపై పారదర్శకత తీసుకురావాలి. ట్యాంకర్ల రవాణాను యుద్ధ ప్రాతిపదికన క్రమబద్ధీకరించి, రాత్రిపూట కూడా లోడింగ్ జరిగేలా చూడాలి. ప్రజల్లో ధైర్యం నింపేలా ప్రతి బంకు వద్ద అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను డిజిటల్ బోర్డుల ద్వారా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

### జిల్లాలో సరిపడా ఇంధన,

# ఎల్పిజి గ్యాస్ నిలువలు

**- ప్రజలెవరు అసత్య ప్రచారాలను నమ్మవద్దు**
**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.**

**ములుగు :** ములుగు జిల్లా ప్రజలకు సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల నిలువలు ఉన్నాయని ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళనకు గురి కావద్దని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌పీజీ వంట గ్యాస్ మరియు పెట్రోల్, డీజిల్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని,సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్ద సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, ముందస్తు బుకింగ్స్ కూడా పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా డీలర్లు రీటైల్ యూనిట్లు, సివిల్ సప్లైస్ అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కూడా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ప్రజలెవరు సోషల్ మీడియాలో, ఇతర మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలను, వదంతులను నమ్మి ఆందోళనకు గురికావద్దని కోరారు. ఇంధనాన్ని గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ అదనపు ఎస్పీ మహేందర్ ఆర్డీవోలు తాసిల్దార్లు మైనింగ్ ఇరిగేషన్ పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుండి 100శాతం ఇసుక సరఫరా మన ఇసుక వాహనం ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు

ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్ రెవెన్యూ మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తాగిన మత్తులో బస్సు డ్రైవింగ్

**- తప్పిన పెను ప్రమాదం**




**విశాఖపట్నం:** నగరంలోని జగదంబ జంక్షన్ వద్ద బస్ బీభత్సం సృష్టించింది. టికెట్ కట్ చేయడానికి ఆపిన సమయంలో డ్రైవర్ దిగిన వేళ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా బస్సు నడపడం ప్రారంభించాడు. బస్లో ప్రయాణికులు ఉండగానే నియంత్రణ లేకుండా దూసుకెళ్లాడు. దాదాపు కిలోమీటర్ మేర అడ్డంగా వెళ్లి వాహనాలు, వస్తువులను ఢీకొట్టాడు. ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నప్పటికీ పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మద్యం తాగిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్, కండక్టర్ను పోలీసులు విచారిస్తున్నారు.

## మహాత్మ జ్యోతి భూ పూలే బిసి బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనికి




**సిద్దిపేట** కలెక్టర్ షేర్ పల్లి బందారం గ్రామంలో మహాత్మా జ్యోతి పూలే బీసీ బాలికల మరియు జూనియర్ కళాశాల ను సందర్శించి అన్నం, బెండకాయ కూర, పాలకూర పప్పు, రసం, నెయ్యి, పెరుగు లను పరిశీలించారు.
పాలకూర పప్పు మరి ఇంత పలచగా ఉంటుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఇలాగే వండుతారా అని వంట సిబ్బంది పైన మండిపడ్డారు. కూరలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వంట గది, డైనింగ్ హాల్ ఎల్లపుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.గురుకుల ప్రాంగణం కలియ తిరిగారు. విద్యార్థులకు మరుగుదొడ్లు మైదానంలో ఉన్నాయని రాత్రి వేళల్లో భయపడుతున్నారని వసతి గృహంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ కలెక్టర్ కి తెలపగా సానుకూలంగా స్పందించి ఈడబ్ల్యూఐడిసి అధికారులు వచ్చి దానికి సంబంధించిన ఎస్టిమేట్ వేస్తారని తప్పనిసరిగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.విద్యార్థుల క్రమశిక్షణ అలవాట్లు, ప్రవర్తన నియమావళి ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు మానిటర్ చెయ్యాలని చదువు, భోజనం, వసతి విషయం లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.

# ఉప్పల ట్రస్ట్ నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం




**కల్వకుర్తి మార్చి 26 (అక్షర గళం)** కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన జోగు ప్రణీత నోబెల్ స్కూల్లో 5వ తరగతి చదువుతుంది. ఇటీవల ఆమె తండ్రి జోగు బంగారయ్య ప్రమాదవశాత్తు మరణించారు. ఆమె కూతురు విద్యకు దూరం కావద్దనే ఉద్దేశంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15,000 ఫీజును నోబెల్ స్కూల్ యాజమాన్యానికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త సత్యనారాయణ, ఉపసర్పంచ్ భీమయ్య, దార మోని గణేష్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై సమీక్ష సమావేశం



కల్వకుర్తి మార్చి 26 (అక్షర గళం) కల్వకుర్తి మండల పరిధిలోని తుర్కలపల్లి గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ లత శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై వార్డు సభ్యులు, అధికారులతో కలిసి సమగ్రంగా చర్చించారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామంలో తాగునీటి ఎద్దడి కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని,నిర్ణయించారుకార్య క్రమంలో గ్రామ వార్డ్ మెంబెర్స్ శివప్రసాద్ రాంచందర్ పరహాణ అన్వర్ దీప రమేష్ మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## ఐక్యత ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**కల్వకుర్తి మార్చి 26 (అక్షర గళం)** హైదరాబాద్ లోని ఐక్యత పౌండేషన్ ట్రస్ట్ కార్యాలయంలో..ఐక్యత ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో..టాస్క్- సిఓఓ,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్‌డకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు కేక్ కట్ చేసి,పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి ఆయనకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సమాజానికి, కల్వకుర్తి నియోజక వర్గానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడుతూ,ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరించి కొనసాగాలని ఆకాంక్షించారు, అలాగే ఆయురారోగ్యాలతో , భగవంతుని ఆశీస్సులతో ప్రజల మద్దతు అభిమానంతో భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి నియోజక వర్గ ప్రజలకు మరింతగా సేవ చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఐక్యత ఫౌండేషన్ సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

### వాణిజ్య దుకాణాలు లీజుకు ఇవ్వడానికి

# టెండర్లు ఆహ్వానం

అక్షర గళం, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని నెక్లెస్ రోడ్ వద్ద ఉన్న నీరా కేఫే భవనం (నీరా ప్రాసెసింగ్ యూనిట్, బ్యాంక్వెట్ హాల్ (7) వాణిజ్య దుకాణాలు లీజుకు ఇవ్వడానికి మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ తాడీ తాపర్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్ టెండర్లు ఆహ్వానించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని గౌడ వృత్తికి చెందిన సంఘాలు, 2026 జనవరి 1 నాటికి ఎక్సైజ్ శాఖలో నమోదు చేయబడి క్రియాశీలంగా ఉన్న సంఘాల నుండి నిర్దిష్ట నిబంధనలు షరతుల మేరకు ఈ టెండర్లు పిలిచారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని అన్ని ఆసక్తి గల గౌడ వృత్తి సంఘాలు టెండర్ ప్రక్రియలో పాల్గొనవలసిందిగా కోరారు. ఆసక్తి గల గౌడ వృత్తి సంఘాలు 09-03-2026 ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా బిడ్ దాఖలు చేసుకోవచ్చు. బిడ్ల దాఖలుకు గడువు తేదీని 31-03-2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు పొడిగించబడినది. సాంకేతిక , ఆర్థిక బిడ్లను 01-04-2026 తేదీన పరిశీలించి ఖరారు చేయబడును. వివరమైన ప్రకటన, దరఖాస్తు విధానం మరియు టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు www.tgttcfc.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

### నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు

# సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి మార్చి 26 (అక్షర గళం) తన పుట్టినరోజు సందర్భంగా వ్యక్తిగతంగా ప్రతిక్షంగా పరోక్షంగా జరిపిన, శుభాకాంక్షలు తెలియజేసిన కార్యకర్తలు అభిమానులు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు గురువారం తెలిపారు. సందర్భంగా సుంకిరెడ్డి రెడ్డి మాట్లాడుతూ నా జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం వ్యాప్తంగా మీరు చూపించిన అపారమైన ప్రేమ,అభిమానం, ఆశీర్వాదాలు నాకు ఎంతో ఆనందంతో పాటు,బాధ్యతను పెంచాయి అని తెలిపారు. నేను వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయినా మీరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఘనంగా నిర్వహించిన వేడుకలు నా జీవితంలో మరువలేని మరిచిపోలేను,మీ అందరి ప్రేమే నాకు శక్తి మీ విశ్వాసమే నాకు ప్రేరణ పేర్కొన్నారు.






తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

# తెలంగాణ రౌండప్


## శుక్రవారం - 27 మార్చి 2026 - పేజీలు

## ఘనంగా అంగన్వాడి కేంద్రంలో

# అక్షరాభ్యాస కార్యక్రమం







**కల్వకుర్తి మార్చి 26 (అక్షర గళం)** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో అంగన్వాడి,1,2కేంద్రాలలో గురువారం చిన్నారులకు అక్షరాభ్యాసం,సామాజిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడిపిఓ శాంతి రేఖ,సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులను ఉద్దేశించి సిడిపీఓ శాంతిరేఖ మాట్లాడుతూ..ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో ముఖ్యమైనవని వారు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు పోషకాహారం,ప్రాథమిక విద్య మరియు ఆరోగ్య అవగాహన అందించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయడమే అంగన్వాడీ కేంద్రాల లక్ష్యమని వారు పేర్కొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ..మొట్టమొదటిగా చిన్నారులు అంగన్వాడి కేంద్రాల్లోనే అభ్యాసిస్తారని పిల్లల భవిష్యత్తు అంగన్వాడి టీచర్ల బాధ్యత ఉందని అన్నారు. చిన్నారుల మొదటి మెట్టు అంగన్వాడి కేంద్రం నుండే అభ్యాసం ప్రారంభం అవుతుందని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు అంగన్వాడి టీచర్లు తీర్చేదిద్దాలని కొనియాడారు. చిన్నారుల సామాజిక వేడుకల ఆనందోత్సాహాలు,కోలహాలతో కొనసాగాయి. చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,అంగన్వాడి సూపర్వైజర్ తిరుమల,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పావని,కబీర్ అంగన్వాడి ఉపాధ్యాయులు మాధు పద్మ,పోగుల లక్ష్మీదేవి,ఆయాలు మీసాల సునీత,కాకి నాగమణి, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ..

**- కీసర సర్కిల్ ఇన్స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు**









**కీసర, మార్చి 26,(అక్షర గళం) :** రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని,అవగాహనతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని కీసర సర్కిల్ ఇన్స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు అన్నారు. గురువారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని స్ఫూర్తి కళాశాల లో విద్యార్థులకు కీసరలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం కీసర సర్కిల్ ఇన్స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐపిలు సి.హెచ్.హరిప్రసాద్,బి.నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ,ముఖ్యంగా ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయకూడదు అనే నియమాన్ని కచ్చితంగా పాటించడం ద్వారా ప్రాణాంతక ప్రమాదాలను నివారించవచ్చు. రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదాలు,ట్రాఫిక్ నిబంధనలు పాటించకాపోవడం హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. ఫోన్ వాడకపోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో నాగారం కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు



నాగారం, మార్చి 26,(అక్షర గళం) : ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధి ఈస్ట్ గాంధీ నగర్ లో నూతన ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల కోసం చేపడుతున్న గృహ నిర్మాణ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు పంగ హరిబాబు, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజి ఎంపిటిసి మంచాల ప్రవీణ్ కుమార్,మాజి సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్,ఈస్ట్ గాంధీ నగర్ కాలనీ అధ్యక్షుడు సత్యం సాగర్,కిల్లారి శ్రీనివాస్, షేక్ గౌస్, ప్రవీణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీ బాలికల ఆరోగ్య పరిరక్షణపై

# ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్







కల్వకుర్తి మార్చి 26 (అక్షరగళం):విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ ఆదేశించారు.గురువారం అదనపు కలెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్ లాల్ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని డిఇఓ రమేష్ కుమార్,జిసిడిఓ శోభారాణి లతో కలిసి ఆకస్మికంగాసందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వంటగది మరియుఆహారపదార్థాల నిల్వ గదిని పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెస్ కమిటీ విద్యార్థులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, పాఠశాలకు సరుకులు వచ్చిన ప్రతిసారీ రిజిస్టర్లలో మెస్ కమిటీ విద్యార్థులు సంతకం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఆహార పదార్థాల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.అనంతరం ఎస్ఎస్సీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి, బాగా సిద్ధమై పరీక్షలను మంచిగా రాయాలని ప్రోత్సహించారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, పరీక్షలు అంటే భయపడ కాకూడదనిసూచించారు.పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్, పాఠశాలకు అవసరమైన అంశాలపై వెంటనే ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు.బాలికల సంరక్షణ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్త హీనత తో బాధపడే విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఏఎన్ఎంలు ప్రతి విద్యార్థిని పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందించకుంటే రక్తహీనతకు గురవుతారని, అందుకు ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన ఆదేశించారు. ఆయన వెంట డిఇఓ రమేష్ కుమార్, జి సి డి ఓ శోభారాణి, ఎంపీడీవో ఇతర మండల స్థాయి అధికారులు ఉన్నారు

## పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించడానికి

# జిల్లా యంత్రాంగం కలిసి కట్టుగా పని చేయాలి

### - రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమీషన్ సభ్యులు చందన




**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :** జవహార్ నగర్ లోని పిల్లలను కాపాడడమే కాకుండా వారికి బంగారు భవిష్యత్తును అందించడానికి జిల్లాయంత్రాంగం మొత్తం కలిసి కట్టుగా పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమీషన్ సభ్యులు చందన అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లోఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమీషన్ సభ్యులు సరిత, చందనలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమీషన్ సభ్యులు చందన మాట్లాడుతూ ఇటీవల మేము జవహార్ నగర్ సందర్శించడం జరిగిందని, జవహార్‌నగర్ కార్పొరేషన్‌లో దాదాపు 100 కాలనీలు ఉన్నాయని, ఆ కాలనీలలో గరిష్టంగా అన్నీ స్లమ్ ఏరియాస్ (మురికివాడలు) ఉన్నాయని, అక్కడ పిల్లలకి కనీసం విద్య అందించలేని పరిస్థితిలో ఉన్నామన్నారు.అక్కడ పిల్లలకి మరియు పెద్దలకి సరైన ఆరోగ్య సౌకర్యాలు లేవని, పిల్లలకు కనీస విద్య కూడా అందడం లేదని అన్నారు. పిల్లలకి మనం అందించాల్సిన కనీస సౌకర్యాలు కూడా అందించలేకపోతున్నాం అని మా కమిషన్ చాలా బాధపడుతోందని అన్నారు.ఈ సమస్యలను మనం మొదటి ప్రాధాన్యతగా తీసుకోని ఒక ప్రణాళిక ప్రకారం ఒక్కొక్కటిగా చేసుకుంటూ ముందుకు వెళ్దామన్నారు.. ఒక స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసుకొని అన్ని శాఖలు తమ తమ విధులను అంకితభావంతో పని చేయడమే కాకుండా, ఆ పిల్లలు మన పిల్లలే అనే ఆలోచనతో చేస్తే తప్పకుండా ఈ సమస్యను పరిష్కరించగలమన్నారు.. చైల్డ్ లేబర్ చాలా మంది ఉన్నారని లేబర్ డిపార్ట్ మెంట్ వారిని గుర్తించి వివరాలు అందించాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ జవహార్ నగర్ సమస్యను ఒక స్పెషల్ డ్రైవ్ ద్వారా అన్ని శాఖల సమన్వయంతో తప్పకుండా పరిష్కరిస్తామని అందుకు అవసరమైన పూర్తి సహకారాన్నీ అన్ని శాఖల ద్వారా తీసుకొని విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రావతి, కీసర ఆర్డిఓ రాజేష్, డిఈఓ విజయ కుమారి, డిడబ్ల్యూఓ శారద, పోలీసు, లేబర్, వైద్య శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు టైరు కింద పడి వ్యక్తి కాలు నుజ్జు



కల్వకుర్తి మార్చి 26 (అక్షర గళం) కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్నగర్ చౌరస్తా వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు వెనుక టైరు కింద పడటంతో ఒక వ్యక్తి కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఊర్కొండపేట గ్రామానికి చెందిన యేసు అనే వ్యక్తి కల్వకుర్తిలో మహబూబ్ నగర్ వెళ్లే బస్సు అనుకొని పొరపాటున దేవరకొండ బస్సు ఎక్కారు. వెంటనే దిగే ప్రయత్నం చేయగా, బస్సు వెనుక టైర్లు కాలుపై నుండి వెళ్లడంతో ప్రమాదం జరిగింది. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

## నేడు ఆర్టీసీ బస్టాండులో పులిహోర ప్రసాదం వితరణ




**కల్వకుర్తి మార్చ్ 26 (అక్షర గళం):** కల్వకుర్తి ఆర్యవైశ్య సంఘం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని కల్వకుర్తి బస్టాండ్ లో ఉన్న అంబలి చలివేంద్రం కేంద్రంలో ప్రయాణికులకు పులిహోర ప్రసాదం వితరణ నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గంధం కిరణ్ ప్రసాద్ దాచుపల్లి శ్రీనివాసులు గురువారం మీడియాకు తెలిపారు . ఈ సేవలను ప్రయాణికులు జాతరకు వెళ్లేవారు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు కార్యక్రమానికి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.

## రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





**కల్వకుర్తి మార్చ్ 26 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా బుధవారం రాత్రి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కల్వకుర్తి ఎమ్మెల్యే తో పాటు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్లా రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు .

## మధ్యాహ్నభోజనంలో చేపల కూర

**హైదరాబాద్,** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక తీపి కబురు అందించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తుండగా, ఇకపై ఆ మెనూలో చేపల కూరను కూడా చేర్చనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అసెంబ్లీలో వెల్లడించారు.సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈ ప్రకటన చేశారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూరను అందిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే కేబినెట్లో చర్చించాం" అని ఆయన వివరించారు.పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారి కోసం ప్రత్యేకంగా 'తిలాపియా' అనే జాతి చేపలను పెంచనున్నట్లు మంత్రి తెలిపారు. "ఈ చేపకు మధ్యలో ఒక్కటే వెన్నుముల్లు ఉంటుంది. కాబట్టి పిల్లలు ఎలాంటి ఇబ్బంది లేకుండా తినవచ్చు. వీటిని ప్రత్యేకంగా పెంచి విద్యార్థులకు అందిస్తాం" అని శ్రీహరి పేర్కొన్నారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఆయన గుర్తుచేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడంతో పాటు, గ్రామస్థాయిలో క్రీడలను బలోపేతం చేసేందుకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని మంత్రి తెలిపారు.

## ఈవీఎంల గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కడప** గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఈ. శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్ రావు(బిజెపి), జనార్ధన్, జబీవుల్లా (తెదేపా), గౌస్ పీర్ (కాంగ్రెస్), ఫయాజ్ అహ్మద్(వైసిపి) డా.శ్రీనివాసులు (ఆప్), విశ్వనాథ్ (జేఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

## అదిలాబాద్ జిల్లాలో భారీ ఎత్తున నాకా బందీ



**అదిలాబాద్** అదిలాబాద్ జిల్లా పోలీసులు బుధవారం రాత్రి భారీ ఎత్తున నాకా బందీ నిర్వహించారు. రాత్రి 9 గంటలనుంచి పన్నెండు గంటలవరకు జిల్లా వ్యాప్తంగా 28 చెక్ పాయింట్లతో నాకా బంధీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో 41 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసారు. నెంబర్ ప్లేట్లు లేని 13 వాహనాలు, సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాపై దృష్టి సారించారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు కుడా పాల్గోన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ల అందోళన

**హైదరాబాద్** విద్యుత్ సంస్థలో ఒకే సర్వీస్ ఒకే రూల్ ఉండాలని రెండు సర్వీస్ రూల్ లు ఉండకూడదని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ అజమాబాద్ విద్యుత్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ కిరణ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో 23 వేల మంది విద్యుత్ కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో ఉన్న కార్మికులను పర్మినెంట్ చేస్తున్నామని మోసం చేశారని గుర్తు చేశారు. ఆర్టిజన్ కార్మికులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఎక్కడ లేని రూల్ తెలంగాణ రాష్ట్రంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఒకటే సంస్థ ఒకే రూల్ ఉండాలని విద్య అర్హతను బట్టి ఆర్టిజన్ పోస్టులను కేటాయించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

## వరంగల్ లో కల్తీ కారం తయారీ కేంద్రంపై దాడులు





**వరంగల్** వరంగల్ ఎనుమాముల మార్కెట్ సమీపంలోని ఓ ఇండస్ట్రీస్ పై ఆహార నియంత్రణ శాఖ అధికారులు, పోలీసులు మెరుపు దాడులు చేశారు. మిర్చి తొడిమలతో కల్తీ కారం తయారు చేస్తున్నట్లు గుర్తించి,70 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రతా అధికారులు కృష్ణమూర్తి, మౌనికతో కలిసి సీఐ సురేశ్ ఈ తనిఖీలు చేపట్టారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జాయింట్ కలెక్టర్ ఆర్డీవో ఆదేశాల మేరకు బి. కోడూరు మండలంలో తనిఖీలు

**పోరుమామిళ్ల** ( బి కోడూర్ )కడప జాయింట్ కలెక్టర్. కడప డిస్ట్రిక్ట్ సప్లై ఆఫీసర్. బద్వేల్ ఆర్డిఓ వారి ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టిన రెవిన్యూ అధికారులు ఈ క్రమంలో బద్వేల్ నియోజకవర్గం బి. కోడూరు మండలంలో పరిసర ప్రాంతాలలో వివిధ హోటల్లో తనిఖీలు చేసిన రెవెన్యూ అధికారులు, నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ గ్యాస్ వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు.తనిఖీ సుమారు 5 గ్యాస్ సిలిండర్ లు స్వాధీన పరచుకున్న అధికారులు.యస్ శివశంకర్ ఇఃబటబి, బద్వేల్ యం గీత ప్రసాద్ రెడ్డి ఈఎ, ఇంకా నాయకులు ప్రజలు పాల్గొన్నారు

## కొట్టుకున్నారు కుర్చీలకు ఎసరు తెచ్చుకున్నారు



**బద్వేలు** బద్వేలు నీటిపారుదల శాఖ లో ఇంచార్జ్ డి ఈ గా పనిచేస్తున్న వేణుగోపాల్ రెడ్డి కడప నీటిపారుదల శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ప్రణీత్ రెడ్డి ఇటీవల కడప కార్యాలయంలో కొట్టుకున్నారు చొక్కాలు చిరిగేలా ఇద్దరు కొట్టుకున్నారు అనంతరం వేణుగోపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు పరిణీత్ రెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేశారు అదే సమయంలో అతను వైద్య చికిత్సల కోసం కడప రిమ్స్ లో చేరారు ఈ ఈ విషయంపై ఎస్పీ కి తెలియజేశారు ఈ మొత్తం వివాదం తీవ్ర విమర్శలకు దారి తీసింది కార్యాలయంలో కొట్టుకోవడంతో ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు ఇద్దరిపై చర్యలు తీసుకోవడంతో పాటు అందుకు దారి తీసిన పరిస్థితులపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు కదిలిన ఇద్దరు స్థానాలు నీటిపారుదల శాఖ రెగ్యులర్ సర్కిల్ ఈ ఈ పరిధిలోని ప్రొద్దుటూరు సబ్ డివిజన్ బద్వేలు ప్రాంత ఇన్చార్జి డి ఈ గా వేణుగోపాల్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు ఈ ఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ప్రణీత్ రెడ్డి పనిచేస్తున్నాడు ఘటన నేపథ్యంలో వేణుగోపాల్ రెడ్డి ని డి ఈ స్థానం నుంచి తొలగించి వెల్లిగళ్ళు విభాగం రాయచోటి డివిజన్ కు జేఈగా బదిలీ చేశారు ప్రణీత్ రెడ్డి నీ కడప రెగ్యులర్ ఈఈ కార్యాలయం నుంచి అన్నమయ్య డివిజన్ రాజంపేటకు పంపారు బద్వేలు డివిజన్ కు సంబంధించి వెల్లిగల్లు డి ఈ రమణయ్య ను ఇంచార్జి గా నియమించారు

## ఏసీబీకి చిక్కిన మామడ ఎస్సై అశోక్



**నిర్మల్** సమాజంలో ఉన్నతమైన ఉద్యోగం చేస్తూ జీతమే కాకుండా మరింత ఎక్కువ డబ్బులు పొందాలనే ఆశతో కొంత మంది ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారు. తాజాగా మామడ ఎస్సై లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. గురువారం పోలీస్ స్టేషన్ పై అవినీతి నిరోధశాఖ అధికారులు దాడులు చేపట్టారు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నుండి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు స్టేషన్ ఎస్సై తీగల అశోక్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన

# హోం మంత్రి అనిత



**మార్కాపురం** ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు వంగలపూడి అనిత, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని హోంమంత్రి ఆదేశాలు ఇచ్చారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

## లవ్ ప్రపోజ్ చేసిన ప్రొఫెసర్ ..

# చెప్పుతో కొట్టిన విద్యార్థిని


**బెంగళూరు** తాను చదువు చెబుతున్న వి.ద్యార్థినికి ఆ ప్రొఫెసర్ ఐ లవ్యూ అన్నాడు. అంతే విద్యార్థిని చెప్పు తీసుకుని వాయించింది.కర్నాటకలోని నీలమంగళ మెడికల్ కాలేజీలో ఘటన జరిగింది. క్లాస్ రూంలోనే ఒక విద్యార్థినికి ప్రేమ ప్రతిపాదన పంపాడా ప్రొఫెసర్. మొదట తనకే ప్రతిపాదించిందని ఆరోపిస్తూ, ఆమెపై ఒత్తిడి తెచ్చి అక్కడినుంచి వెళ్లిపోయాడు. అయన పనితీరుపై విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహం కలిగింది. కళాశాల ప్రాంగణంలోనే ప్రొఫెసర్ను నిలదీసి చితకబాదారు. అతనికి గుణపాఠం నేర్పేందుకు చెప్పుతో కొట్టింది బాధిత విద్యార్థిని

# మోయినాబాద్ డ్రగ్స్ కేసు

**– నిందితుల రిమాండ్ ఏప్రిల్ 8 వరకు పొడిగింపు**

**హైదరాబాద్** రంగారెడ్డి జిల్లా: మొయినాబాద్ ఫామ్హౌస్ డ్రగ్స్ కేసులో మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో నిందితులను పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను ఈనెల 23న కోర్టు ఆదేశాల మేరకు కస్టడీకి తీసుకున్న పోలీసులు, విచారణ అనంతరం గడువు పూర్తయ్యాక రాజేంద్రనగర్ కోర్టులో ప్రవేశపెట్టారు. మూడు రోజుల కస్టడీలో సేకరించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిందితులను చంచల్గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితుల రిమాండ్ను ఏప్రిల్ 8 వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు...

## రాయపోల్ మండలంలో ఆకస్మికంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట** రాయపోల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. మెడికల్ ఆఫీసర్ అరెపల్లి లో ఫీల్డ్ విసిట్ లో ఉన్నట్లు సిబ్బంది తెలపగా వీడియో కాల్ చేసి నిజనిర్ధారణ చేశారు. ఏదో ఒక సాకు చెబుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రోజు వారిగా ఆసుపత్రి సమయ వేళలు పాటించాలని ఎల్లపుడు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం రాయపోల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనికి చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. తహసిల్దార్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయ వేళలు పాటించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ వివరాలు ఆరా తీశారు.ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ బిఎల్ఓ పని తీరును పర్యవేక్షణ చెయ్యాలని తహసీల్దార్ ను ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణలో మండలంలోని ఆయా గ్రామాల్లో భూ యజమానులతో మాట్లాడి ఆర్బిటరేషన్ 100 శాతం పూర్తి చెయ్యాలని తహసిల్దార్ ను ఆదేశించారు.

## పర్యావరణ పరిరక్షణకు

# విద్యార్థుల ముందడుగు



**చెక్కపల్లి,** అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) చెక్కపల్లిలో విద్యార్థులచే విత్తన బంతుల తయారీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల యాజమాన్యం చర్యలు చేపట్టింది.ఈ సందర్భంగా విద్యార్థులకు విత్తన బంతుల తయారీ విధానం గురించి ఉపాధ్యాయులు ప్రాక్టికల్‌గా వివరించి చూపించారు. విత్తన బంతుల ద్వారా అడవుల విస్తరణకు ఎలా దోహదపడుతుందో, ప్రకృతి సంరక్షణలో వాటి పాత్ర ఏమిటో వివరించారు.

అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు డ్రాయింగ్ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 1000కు పైగా విత్తన బంతులను తయారు చేశారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను గుర్తించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్ మాట్లాడుతూ, విత్తన బంతులు అడవుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకానికి కృషి చేయాలని, ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను నేషనల్ గ్రీన్ కోర్ గైడ్ టీచర్ దూస సంతోష్ అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ.

**– జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి జయపాల్ రెడ్డి.**




**ఇబ్రహీంపట్నం** ప్రాథమిక ఆరోగ్యకేంద్రము జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జయపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.తల్లులను ఆరోగ్య కేంద్రంతో అందుతున్న సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు.గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేసుకోవాలని అన్ని రకాల వసతులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయని,సాధారణ కాన్పు వల్ల కలిగే లాభాలు,తల్లిపాల ప్రాముఖ్యత,వ్యాధి నిరోధక టీకాలు తదితర విషయాల గురించి తల్లులకు వివరించారు. ఆసుపత్రిలోని ల్యాబ్ లో నిర్వహిస్తున్న పరీక్షలు,డ్రగ్స్ స్టోర్ రూమ్,వ్యాక్సిన్ స్టోర్ రూమ్,ఓపి మొదలైన వాటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ వనజ వైద్యాధికారి,సి హెచ్ ఓ విజయభాస్కర్, సూపర్వైజర్లు,నర్సింగ్ ఆఫీసర్స్,ఫార్మసిస్ట్,లాబ్ టెక్నీషియన్ ఏఎన్ఎం ఆశాలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే భాగంగా వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన




**సిద్దిపేట** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట మోడ్రన్ బస్ స్టాండ్ వద్ద వాహనదారులకు మరియు ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ గోపాల్ రెడ్డి, ఎస్.ఐ ఉమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రయాణికులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐ.ఎస్.ఐ ముద్ర కలిగిన హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. "వేగం కన్నా ప్రాణం ముఖ్యం" అని గుర్తు చేస్తూ, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని కోరారు. సిగ్నల్ జంపింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించాలని పిలుపునిచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను ప్రయాణికులకు వివరించారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాద రహిత సిద్దిపేటను సాకారం చేసుకోవచ్చని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఏపీలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు

# ఘోర ప్రమాదం

**మార్కాపురం** మార్యాపురంలో ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు ఘోర ప్రమాదం జరిగింది. టిప్పర్ లారీని ఢీకొని బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో పది మంది సజీవ దహనం అయ్యారు. మార్కాపురం జిల్లాలోని రాయవరం సమీపంలో ఉన్న క్వారీల వద్ద టిప్పర్ లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. క్షణాల్లోనే మంటలు వ్యాపించి బస్సు, లారీ పూర్తిగా దగ్ధమైయ్యాయి. నిర్మల్ నుంచి నెల్లూరుకు హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సు వెళుతు?వొ. ఘటన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

# జిల్లాలో ఇంధన కొరత లేదు

**- పుకార్లను నమ్మవద్దు - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్,** జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్లు కనిపిస్తున్న నేపథ్యంలో, పరిస్థితిని సమీక్షించి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అపోహలేనని స్పష్టం చేసిన కలెక్టర్, అవసరం లేకపోయినా ప్రజలు బంకుల వద్దకు చేరుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా కొనసాగుతోందని, పెట్రోల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధులు కూడా తమ వద్ద తగిన నిల్వలు ఉన్నట్లు ధృవీకరించినట్లు తెలిపారు.ఎల్పీజీ గ్యాస్ సరఫరా సాధారణంగానే?జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్, సరఫరా ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోందని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని సూచించారు.క్షేత్రస్థాయిలో పర్యవేక్షణపరిస్థితిని దగ్గరగా గమనించేందుకు అదనపు కలెక్టర్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.పానిక్ బాయింగ్ చేయవద్దుసోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు 'పానిక్ బాయింగ్'కు పాల్పడవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజలకు అవసరమైన ఇంధన వనరులు నిరంతరం అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.

## మహిళా సాధికారత కోసం

# ప్రభుత్వం కృషి

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్...**



**రాయికల్:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గురువారం రోజున రాయికల్ మండలంలో వివిధ గ్రామాలలో 70 లక్షలతో మహిళ సంఘ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో 20 లక్షలతో రెండు,భూపతి పూర్ గ్రామంలో 20 లక్షలతో రెండు,వడ్డే లింగాపూర్ గ్రామంలో 10 లక్షలతో ఒకటి,వడ్డెర కాలనీ లో 10 లక్షలతో ఒకటి,చర్ల కొండాపూర్ గ్రామంలో 10 లక్షలతో ఒకటి మహిళా సంఘం భవనాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం లో 60 కి పైగా మహిళా సంఘం భవనాలు మంజూరు అయ్యాయి.మహిళా సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది,మహిళలకు 1300 కోట్ల బ్యాంక్ వడ్డీ ప్రభుత్వం చెల్లించింది.200 యూనిట్ల ఉచిత కరెంట్,సన్న బియ్యం,రేషన్ కార్డులు,ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని అన్నారు.ఆరోగ్య శ్రీ వైద్యం 10 లక్షలకు పెంచిందని,అత్యధిక పల్లె దవాఖానాలు జగిత్యాల మంజూరు అయ్యాయని,తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు.ప్రభుత్వం తో కలసి పని చేసి జగిత్యాల అభివృద్ధి కి కృషి చేస్తానని,ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వేసవిలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.రాయికల్ మండలం లో రహదారుల అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి ఎమ్మెర్వో నాగార్జున,ఎంపీఓ సుష్మా, ఏఈ ప్రసాద్,ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,సర్పంచులు ఆకుల అంజా గౌడ్,గుర్రం భావన,బండారి మానస సాయి రాజ్,భోదాసు చంద్రశేఖర్,దేవుని రవి,ఉప సర్పంచ్ లు చాంద్ పాషా,సంజీవ చారి,బోదాసు రాజేష్,భూక్యా శంకర్,లక్ష్మీ నారాయణ,నాయకులు మోర హనుమండ్లు,కోల శ్రీనివాస్,ఏనుగు మల్లారెడ్డి,గ్రామ మండల నాయకులు అధికారులు మహిళ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్భయ నిధులతో మహిళల భద్రతకు పెద్దపీట

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ములుగు** నిర్భయ నిధులతో మహిళల భద్రతకు పెద్దపీట వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిర్భయ నిధి పథకం ద్వారా ములుగు జిల్లాలో "ఇన్‌క్లూజివ్ సిటీస్ ఫర్ ఉమెన్ అండ్ గర్ల్స్" పైలట్ ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని తమ ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా భద్రతా ప్రమాణాలను పెంచడంపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ములుగు జిల్లాలోని మహిళలు, బాలికలు మరింత సురక్షితమైన సౌకర్యవంతమైన అవకాశాలను కలిగి ఉండేందుకు గాను పింక్ ఆటోస్ సౌకర్యాలను కల్పించడం, జన సమూహ కూడలిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు, వివిధ వృత్తులలో పనిచేస్తున్న బాలింత మహిళలు, వారి శిశువుల భద్రత, పరిరక్షణకై పని ప్రదేశాలలో ప్రత్యేక క్రెష్ సెంటర్ల ఏర్పాటు, డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి, జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రదేశాలైన మేడారం, లక్నవరం, రామప్ప, బోగత, మల్లూరు దేవాదుల మొదలైన పర్యాటక కేంద్రాలలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశాలతో కూడిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉండగా వెంటనే ప్రతిపాదనలను చేయాలని అన్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఏ బంకు చూసినా కిటకిట

**హైదరాబాద్** నగరంలో పెట్రోల్ బంకులలో చాంతాడంత బారులు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు పెట్టారు. గురువారం ఉదయం నుంచే ప్రధాన పెట్రోల్ బంకుల్లో వాహనదారులు కిక్కిరిసిపోయారు. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో చమురు దిగుమతులపై వదంతులు షికార్లు చేస్తుండటంతో వాహనదారులు ట్యాంక్ ఫుల్ చేయించుకున్నారు. బాటిళ్లు, క్యాన్లలో అదనంగా నిల్వ చేసుకునేందుకు ఎగబడ్డారున్న

## గణపవరంలో పోలీసుల కార్డన్ సెర్చ్

**– మారణాయుధాలు, 70 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో పోలీసులు తెల్లవారుజామున భారీ స్థాయిలో 'కార్డన్ సెర్చ్' తనిఖీలు నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ విస్తృత తనిఖీలు చేపట్టారు.అడిషనల్ ఎస్పీ నిరంజన్, డీఎస్పీ హనుమంతురావు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 30 మంది ఉన్నతాధికారులు, దాదాపు 200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి వీధిని, అనుమానిత ఇళ్లను జల్లెడ పట్టారు.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలతో పాటు భారీగా మారణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 70 ద్విచక్ర వాహనాలు,23 గొడ్డళ్లు, 11 గడ్డపారలు,ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వ్యసనాలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు



పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో.. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' షాకింగ్ నిర్ణయం తీసుకుంది. లీటర్ పెట్రోల్పై రూ. 5, డీజిల్పై రూ. 3 పెంచుతూ ధరలను సవరించింది. ముడిచమురు దిగుమతి వ్యయం పెరగడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ పెంపు తక్షణమే అమలులోకి వచ్చింది.

## విజయవాడలో కోర్టుకు హాజరైన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

**విజయవాడ:** గోరంట్ల మాధవ్ గురువారం విజయవాడ కోర్టుకు హాజరయ్యారు. తనపై నమోదైన కేసు సంబంధంగా న్యాయస్థానంలో విచారణకు హాజరైన ఆయన, కోర్టు ఆదేశాల మేరకు హాజరు నమోదు చేసుకున్నారు.కోర్టు ప్రాంగణానికి వచ్చిన గోరంట్ల మాధవ్‌కు పోలీసులు భద్రత కల్పించారు. కేసుకు సంబంధించిన తదుపరి విచారణను కోర్టు మరో తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన గోరంట్ల మాధవ్, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. నిజం వెలుగులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే వసంత

**ఎన్టీఆర్ జిల్లా** జి.కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్కూల్ టీచర్లు, సిబ్బందితో కలిసి వంట గదిని, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేసారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డుల నిర్వహణను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసారు. కూరలో ఉప్పు కాస్త ఎక్కువైందని గుర్తించి, రుచి విషయంలో జాగ్రత్తగా ఉండాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఎమ్మెల్యే సూచనలపై ఇకపై పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని వంట నిర్వాహకులు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన, శుచికరమైన ఆహారం అందించడంలో అలసత్వం వహించవద్దని అధికారులకు ఆదేశించారు

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

రాబోయే రోజుల్లో వడ్డెర కులస్థులకు ఏ పార్టీ రాజకీయ వాటా కల్పిస్తుందో వారికే అండగా యావత్ వడ్డెర జాతి నిలుస్తుందని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దరుగుల మైసయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు వి.తిరుమల దేవి, జాతీయ యువజన అధ్యక్షుడు వేముల లోకేష్లు మాట్లాడుతూ... వడ్డెరలు గతంలో ఎస్టీ జాబితాలో ఉండేవారని కొంతమంది తమపై కుట్రపన్ని బీసీ ఏ లోకి చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి వడ్డెర కులస్థులను ఎస్టీ జాబితాలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు 4 సంవత్సరాల జైలు శిక్ష

**– పోలీసుల కృషితో బాధితుడికి న్యాయం**

**– ఎస్పీ డి.జానకి,**

**మహబూబ్నగర్** నవాబ్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు శిక్ష విధించింది. 31.01.2023 రోజు చన్నారెడ్డిపల్లి గ్రామ పరిధిలో జరిగిన ఘటనలో, భూవివాదం కారణంగా నిందితులు o1: యెరుకలి వెంకటయ్య, o2: యెరుకలి శ్రీను, o3: యెరుకలి మల్లేష్ కలిసి బాధితుడు యెరుకలి చెన్నయ్యపై హత్యకు యత్నించారు. ముందుగా పథకం ప్రకారం o1 మరియు o3 కర్రలతో దాడి చేయగా, o2 కత్తితో పొడవడం జరిగింది. ఈ దాడిలో బాధితుడు తల, భుజాలు, వెన్ను మరియు చేతులపై తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై నవాబ్పేట్ పోలీసులు వేగంగా స్పందించి నిందితులను అరెస్ట్ చేశారు. కేసు క్రైం నంబర్ 31/2023 గా నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టారు.కేసులో విచారణ అనంతరం, గౌరవనీయ ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు, మహబూబ్నగర్ తీర్పు వెలువరించింది. న్యాయమూర్తి వి.ఈశ్వరయ్య ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి 4 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు, రూ.6,000 జరిమానా (ప్రతి ఒక్కరికి రూ.2,000) విధించారు. అదనంగా, బాధితుడికి పరిహారంగా మొత్తం రూ.30,000 (ప్రతి నిందితుడు రూ.10,000 చొప్పున) చెల్లించాలని ఆదేశించారు.ఈ కేసును సమర్థవంతంగా విచారించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి జి.పురుషోత్తం, ఎస్ఐ (అప్పటి), అదనపు ప్రజాప్రతినిధి మొహమ్మద్ అవేజ్, ప్రస్తుత ఎస్హెచ్ఓ విక్రం ఎస్ఐ, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు లైజన్ ఆఫీసర్ కె.నర్సింహులు మరియు సంబంధిత పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి, అభినందించారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ నియోజకవర్గం లోని మోండా డివిజన్ పరిధిలోని రెజిమెంటల్ బజార్ మదర్ థెరీసా విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు .చలివేంద్రాన్ని ప్రారంభించడానికి సంతోష్ యాదవ్ ఆహ్వానం మేరకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో బాటసారులకు, ప్రయాణీకులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగ పడతాయని, గత 15 ఏళ్ళుగా శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి చలివేంద్రాలను తాను కూడా నియోజకవర్గ వ్యాప్తంగా విరివిగా ఏర్పాటు చేస్తున్నానని, దీనిని ఆదర్శంగా తీసుకుని సంతోష్ యాదవ్ గారు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, అందరూ స్వచ్ఛందంగా ఇలాంటి సేవలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెంట టెంపుల్ కమిటీ చైర్మన్ లు అరవింద్ యాదవ్, గౌరీ శంకర్, వెంకట్రాజు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్ యాదవ్, నందికంటి రవి, నర్సింగరావు, బాబూరావు, అజయ్ కుమార్, మాలతి, మాధవి తదితరులు ఉన్నారు

## మార్కాపురం బస్సు ప్రమాదంలో కొడుకుని కాపాడి తల్లి మృతి



**మార్కాపురం** బుధవారం రాత్రి మార్కాపురం రాయవరం దగ్గర జరిగిన బస్సు దగ్ధం ఘటనలో ఒక తల్లి కొడుకు ను కాపాడి తాను మృతి చెందింది. కనిగిరి మండలం మందాడివారిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి(45), కొడుకు మనోహర్, ప్రమాదానికి గురైన బస్సులో స్వగ్రామానికి వెళ్తుండగా మంటలను గమనించి కొడుకును బయటికి తోసేసింది. తరువాత మంటలు ఎక్కువ కావడంతో బస్సులో చిక్కుకుని, కొడుకు కళ్లెదుటే సజీవదహనమైయింది. ఘటనలో మరో వ్యక్తి ఎనిమిది మందిని కాపాడారు. డోర్ జామ్ అవ్వడంతో, అక్కడే ఉన్న కత్తితో అద్దాలు పగలగొట్టి, 8 మందిని కాపాడి, తాను దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. దట్టంగా పొగ కమ్ముకోవడంతో ఇతరులను కాపాడలేకపోయానని అయన తెలిపారు

## నీళ్ల కొరత, ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు తీర్చాలి

**– భూపాలపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర**

**హైదరాబాద్** నీళ్ల కొరత, ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు తీర్చాలంటూ భూపాలపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అసెంబ్లీలో కోరారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యి, బేస్మెంట్ నిర్మించిన తరువాత ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. నా నియోజకవర్గంలో పలు ప్రాంతాలకు నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయని అయన అన్నారు.

## ప్రారంభమైన కాళేశ్వరం ఎత్తిపోతలు

**కాళేశ్వరం** కాళేశ్వరం లింక్ –2కు అనుబంధం ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి గురువారం గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభం అయ్యాయి. నంది పంప్ హౌస్లో 2, 3 మోటార్లను నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఆన్ చేసారు. నంది రిజర్వాయర్లోకి ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 6,300 క్యూసెక్కుల నీరు ఎత్తిపోతలు కొనసాగనున్నాయి. అక్కడి నుండి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్ హౌస్కు జంట సొరంగాల ద్వారా జలాలు తరలిస్తారు. మూడు రోజుల పాటు ఈ జలాల తరలింపు ఉంటుందని అధికారులు వివరించారు.

## భూములు కోల్పోతున్న రైతులపై పోలీసుల ప్రతాపం

**వికారాబాద్** పరిగి నియోజకవర్గం కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో 1200 ఎకరాలు భూసేకరణ చేస్తున్న అధికారులను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరిట 1200 ఎకరాలు కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని ఆరోపించారు. మా భూములు మాకే అంటూ నిరసన తెలిపారు. అధికారులను అడ్డగించడంతో వాగ్వాదం, తోపులాటకు దారి తీసిరంది. పోలీసులు రంగప్రవేశం చేసి ప్రజలను అడ్డుకున్నారు. మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా తోసేసారు.

## తాండూరులో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ విక్రయాల గుట్టురట్టు.

**– బీదర్ కేంద్రంగా సాగుతున్న తయారీపై వికారాబాద్ టాస్క్ ఫోర్స్ దాడులు.**



**తాండూరు** తాండూరు పట్టణంలో పాత కూరగాయల మార్కెట్లో రేపాల శ్రీధర్ అనే వ్యాపారి కల్తీ అల్లం విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాష బృందం దాడులు నిర్వహించారు. వ్యాపారి నుంచి 40 కేజీల కల్తీ అల్లం స్వాదీనం చేసుకున్నారు. ఎక్కడి నుంచి తీసుకవస్తున్నారని విచారించగా కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన యర్రమల్లి గిరిధర్ అనే వ్యక్తి తయారు చేసి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. వెంటనే బీదర్లోని అతని హోల్సేల్ షాపుపై దాడి చేసి, అక్కడ నిల్వ ఉంచిన మరో 560 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు సీజ్ చేశారు. వారితో పాటు కల్తీ అల్లం రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని(ఐం 39 9028) కూడా సీజ్ చేశారు. ఈ మేరకు నిందితులు యర్రమల్లి గిరిధర్ (తయారీదారు, బీదర్), రేపాల శ్రీధర్ (విక్రేత, తాండూరు)లపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ స్నేహా మెహ్రా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటూ, లాభార్జనే ధ్యేయంగా కల్తీ పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా కల్తీ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు

## హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

**హైదరాబాద్** ఏప్రిల్ 2న జరిగే శ్రీ వీర హనుమాన్ శోభాయాత్ర ర్యాలీని విజయవంతం చేయాలని విహెచ్పి కేంద్ర అధికార ప్రతినిధి రావి నూతల శశిధర్ రావు పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా బజరంగ్దళ్ ఆధ్వర్యంలో కర్మాంగట్లోని హరిహర క్షేత్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వీరు మాట్లాడుతూ ఏప్రిల్ 2న జరిగే హనుమాన్ శోభాయాత్ర లో ప్రతి ఒక్క హిందూ బంధు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎఇందుకోసం ఉదయం 8 గంటల వరకు ఆంజనేయ స్వామి ఆలయానికి ప్రతి ఒక్కరు చేరుకోవాలని కోరారు. ఈ శోభాయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఈ శోభాయాత్రకు సంబంధించి పోలీసులకు సమాచారం ఇచ్చామని మాకు ఏలాంటి అనుమతులు అవసరం లేదని శశిధర్ రావు తెలిపారు..

## మార్కాపురం బాధితులకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం

**అమరావతి** మార్కాపురం జిల్లా రాయవరం బస్సు ప్రమాద బాధితులకు ప్రభుత్వం ఎక్స్రేషియా ప్రటించింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, గాయపడిన వారికి రూ. 2 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర మంత్రిమండలి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేసింది.

## జిల్లాలో ఏ కొరతా లేదు : కలెక్టర్




**ఏలూరు** జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్ కు ఎటువంటి కొరతా లేదని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం జిల్లాలో గ్యాస్, పెట్రోల్ సరఫరాపై అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి కొరతా లేదని, ప్రజల భవిష్యత్తు అవసరాలకు కూడా సరిపడా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో గృహ వినియోగదారులకు సంబంధించి వంట గ్యాస్ రోజుకు సగటున 10 వేల వరకు బుకింగ్స్ నమోదవుతున్నాయని, వాటికి నిర్ణయించిన సమయంలోగా అందిస్తున్నామన్నారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ కూడా ప్రజల అవసరాల మేరకు నిల్వలు ఉన్నాయన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నవారికి ఎక్కువ రోజులు వేచిఉండకుండా నిర్ణీత సమయంలోగా గ్యాస్ సరఫరా చేసేలా గ్యాస్ ఏజెన్సీస్ చర్యలు తీసుకోవాలన్నారు. పి ఎన్ జి గ్యాస్ కనెక్షన్ చాలా తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసుకోవచ్చని, జిల్లాలో పైపు లైన్ ద్వారా నాచురల్ గ్యాస్ సరఫరా పై ప్రజలకు విస్తృతమైన అవగాహన కలిగించి గృహ, వాణిజ్య అవసరాలకు పి ఎన్ జి గ్యాస్ కనెక్షన్ల ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిత్యాన్నదానం నిర్వహించే దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని, పి .ఎన్ .జి. గ్యాస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది దురుద్దేశ్యపూర్వకంగా సోషల్ మీడియా ద్వారా గ్యాస్, పెట్రోల్ కొరత ఉందని వదంతులను వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని, అవసరానికి మించి గ్యాస్, ఆయిల్ కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజీల్ కొరత ఉన్నదంటూ వదంతులు వ్యాప్తి చేసేవారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుత సమయంలో గృహ వినియోగ గ్యాస్ వాణిజ్య అవసరాలకు మరలకుండా పటిష్టమైన నిఘా పెట్టాలని, బ్లాక్ మార్కెట్ చేసే ఏజెన్సీలపై కేసులు నమోదు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ కూడా ప్రజల అవసరాల మేరకు నిల్వలు ఉన్నాయని, ఎటువంటి ఆందోళనకు గురికావద్దని ప్రజలకు అధికారులు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి. విలియమ్స్, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, ఇండియన్ ఆయిల్, భారత్ , హిందూస్తాన్ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు మహేష్, సందీప్, సూర్య, గ్యాస్ ఏజెన్సీస్ అసోసియేషన్ ప్రతినిధి బ్రహ్మానందం, పెట్రోల్ బంక్ యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధి స్వర్ణ శేఖర్, పి ఎన్ జి ఏజెన్సీలకు సంబంధించి గోదావరి గ్యాస్ పైప్ లైన్ , మేఘా గ్యాస్ పైప్ లైన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీజీఎస్పీడీసీఎల్ ఆర్టిజన్ కార్మికుల ఆందోళన

ఉప్పల్ పిఎస్ పరిధి హబ్సిగూడ టీజీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం వద్ద టీజీఎస్పీడీసీఎల్ ఆర్టిజన్ కార్మికుల ఆందోళన,రెగ్యులర్ ఉద్యోగ హోదా ఇవ్వాలని డిమాండ్ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడ డివిజన్ టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆర్టిజన్ కార్మికులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.వివిధ యూనియన్లకు చెందిన ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ (ఏంఅ)గా ఏర్పడి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, తాము ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా చూస్తుండడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.కన్వర్షన్ విధానం ద్వారా తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగ హోదా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే వేతన సవరణలు చేపట్టి, ఏపీఎస్ఈబి నిబంధనలు అమలు చేయాలని, తమ అర్హతలకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాల ఆధారంగా కొనసాగించడం సమంజసం కాదని కార్మికులు మండిపడ్డారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఈనెల 30న మరోసారి అన్ని డివిజన్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఏప్రిల్ 2న సర్కిల్ కార్యాలయాల వద్ద వంటా–వార్పు, ఏప్రిల్ 4న పాల్వంచ కేటీపీస్ వద్ద, ఏప్రిల్ 7న వరంగల్‌లోని విద్యుత్ భవన్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఏప్రిల్ 7లోగా ప్రభుత్వం స్పందించకపోతే, ఏప్రిల్ 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా "కరెంటోళ్ల సమ్మె" పేరిట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టనున్నట్లు ఆర్టిజన్ కార్మికులు స్పష్టం చేశారు.

## గ్యాస్ స్టేషన్ ముందు ఆటో డ్రైవర్స్ ఆందోళన

**హైదరాబాద్** కర్మన్ ఘాట్ లోని గ్యాస్ స్టేషన్ ముందు ఆటో డ్రైవర్స్ ఆందోళన కు దిగారు. బుధవారం రాత్రి నుండి గ్యాస్ కోసం పడికాపులు కాసిన గ్యాస్ కొట్టకపోవడంతో గ్యాస్ బంక్ యజమానులకు, ఆటో డ్రైవర్లకు వాగ్వివాదం జరిగింది. గ్యాస్ ఉన్నపటికీ ఆటోలకు గ్యాస్ కొట్టకుండా కాలయాపన చేసి ఇప్పుడు గ్యాస్ అయిపొయింది అని చెప్తున్నారని ఆందోళనకు దిగారు. గ్యాస్ బంక్ లో గ్యాస్ ఇంకా 38% ఉన్నట్టు చూపిస్తున్న గ్యాస్ కొట్టకపోవడంతో ఆటో డ్రైవరల్ఉ మండిపడ్డారు. గ్యాస్ కోసం ఆటోలు కిలోమీటర్ల మేర ఆగి పోయాయి.

## అనుమానస్పద స్థితిలో బాలిక మృతి

**శ్రీకాకుళం** శ్రీకాకుళం జిల్లాలో గిరిజన బాలిక (17) అనుమానాస్పద మృతి చెందింది. సివిల్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు అత్యాచారం, హత్య చేసి ఉంటాడని బంధువుల అనుమానం. "చదువు చెబుతాను" అంటూ బాలికను నమ్మించి తీసుకెళ్లాడంటున్నారు. మృతురాలు పరీక్షల తర్వాత ఇంటికి వచ్చింది. ఈ నెల . 23న బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు అక్కడే పలుమార్లు అత్యాచారం చేసి దాడి చేసినట్టు అనుమానం.

24న బాలికకు అనారోగ్యం అంటూ తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తరువాత "మీ కుమార్తె చనిపోయింది? నేనే కారణం" అంటూ తల్లిదండ్రులకు చెప్పిన నిందితుడు విషయం బయటకు చెప్పొద్దని, డబ్బు ఇస్తానని ఒత్తిడి చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. బాలిక ఒంటిపై గాయాలు చూసి ఆసుపత్రికి తీసుకువెళ్లిన తల్లిదండ్రులకు ఆసుపత్రికి చేరేసరికి 24 గంటలకు పైగా మృతి జరిగి ఉండవచ్చని వైద్యులు అంటున్నారు. హిరమండలం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు.

# నదిలోకి దూసుకెళ్లిన బస్సు..

## 10 మంది మృతి

**ఢాకా** బంగ్లాదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దౌలత్‌దియా ఘాట్ సమీపంలో 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి పద్మా నదిలో పడిపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది మృతి చెందగా, 11 మంది ప్రాణాలతో బయటపడ్డారు. బస్సును ఫెర్రీపైకి ఎక్కించే సమయంలో నియంత్రణ కోల్పోవడంతో ఇది సుమారు 35 అడుగుల లోతున్న నదిలోకి దూసుకెళ్లింది. అనంతరం భారీ క్రేన్ సాయంతో బస్సును బయటకు తీశారు. గల్లంతైన వారి కోసం డైవర్లు, గజ ఈతగాళ్లు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

## రైలు ఎక్కేప్రయత్నంలో ప్రమాదం..

# విద్యార్థికి తీవ్ర గాయాలు



**రైల్వే కోడూరు** ఓబులవారిపల్లి రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. నంద్యాల ప్యాసింజర్ రైలును ఎక్కే ప్రయత్నంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి రెడ్డయ్య ప్రమాదవశాత్తు రైలు కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి రైలు కిందపడ్డ అతడిని సురక్షితంగా బయటికి తీశారు. అయితే అప్పటికే అతని కుడి కాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం.గాయపడిన విద్యార్థిని హుటాహుటిన రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది.

## డ్రంకెన్ డ్రైవ్‌లో రాజ్ తరుణ్

# మాజీ ప్రియురాలు..

### – మద్యం మత్తులో నడిరోడ్డుపై హల్‌చల్!



**సంగారెడ్డి** జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ ఘటన కలకలం సృష్టించింది. టాలీవుడ్ హీరో రాజ్ తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ ప్రమాదానికి కారణమయ్యారు. అనంతరం స్థానికులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మల్లేపల్లి గ్రామ పరిసరాల్లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. లావణ్య మద్యం సేవించి కారు నడుపుతూ వెళ్తుండగా మల్లేపల్లి వద్ద ఓ బైక్‌ను ఢీకొట్టారు. ప్రమాదం జరిగినప్పటికీ ఆమె కారు ఆపకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. అయితే, ప్రమాదాన్ని గమనించిన స్థానిక గ్రామస్తులు వెంటనే స్పందించి, ఆమె కారును వెంబడించి అడ్డుకున్నారు. ఈ క్రమంలో లావణ్యకు, గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆమెతో పాటు కారులో మరో వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని లావణ్యకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా, ఆమె పరిమితికి మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేశారు. అనంతరం కొండాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# 13కు చేరిన మృతుల సంఖ్య

మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన భీకర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 13కు పెరిగింది. తీవ్రంగా గాయపడిన పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. సహాయక చర్యలను పర్య వేక్షించేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు ఈ ఘటనపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## హనుమకొండలో ఉద్రిక్త వాతావరణం...

### – గిరిజన సంఘ నాయకుల అరెస్టులు



హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి విగ్రహాన్ని ప్రతిష్టించాలని, రాష్ట్రంలోని పేద గిరిజన వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పెండింగ్ స్కాలర్షిప్స్, రియాంబర్స్మెంట్, ఉద్యోగ నోటిఫికేషన్లు తక్షణమే భర్తీ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన డిక్లరేషన్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన గిరిజన సంఘాల కార్యకర్తలను కాకతీయ యూనివర్సిటి పోలీసులు, హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు.

## బాటిళ్లలో పెట్రోల్ కొట్టిస్తే జైలు శిక్ష





**భూపాలపల్లి జిల్లా** టేకుమట్ల గ్రామంలో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కొరత భయంతో ఇంధనాన్ని ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. అయితే, పెట్రోలియం చట్టం–1934 ప్రకారం క్యాన్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో ఇంధనం నిల్వ చేయడం నేరం. మొదటిసారి పట్టుబడితే వెయ్యి రూపాయల జరిమానా లేదా నెల జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే 5 వేల రూపాయల జరిమానా లేదా 3 నెలల జైలు శిక్ష పడుతుందని పోలీసులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాటిళ్లలో పెట్రోల్ తీసుకెళ్లవద్దని హెచ్చరించారు.

# మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌గ్భ్రాంతి

**అమరావతి** మార్కాపురం ప్రమాద ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌గ్భ్రాంతి ప్రకటించారు. ప్రమాద ఘటన పై అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో మంత్రి మాట్లాడారు. ప్రమాద వివరాలను మంత్రి గొట్టిపాటికి అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం ఇచ్చారు. బస్సులో ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేసారు. ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు.

# టీటీడీకి రూ.60 లక్షలు విరాళం



టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు పలువురు దాతలు రూ.60 లక్షలు విరాళంగా అందించారు.వీరిలో చెన్నైకు చెందిన రేవతి విశ్వనాథ్ రూ.40 లక్షలు విరాళంగా అందించారు.హైదరాబాద్ కు చెందిన వి.శ్రీ భవేశ్ చౌదరి రూ.10,07,777 విరాళంగా అందించారు.అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పొనకల నాగేంద్ర రావు రూ.10 లక్షలు విరాళం అందించారు.ఈ మేరకు సదరు దాతలు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

## పోలీసు క్రీడల్లో జగిత్యా ఆర్‌ఎస్‌ఐకి కాంస్య పతకం

### – అభినందించిన ఎస్పీ



**జగిత్యాల** జమ్మూ లో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీల్లో తెలంగాణ పోలీస్ తరపున పాల్గొని కాంస్య పతకం సాధించిన రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. జమ్మూ ద కాశ్మీర్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ తరపున జగిత్యాల జిల్లా నుండి పాల్గొన్న రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ విశేష ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, రమేష్ ను అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలలో తెలంగాణ పోలీస్ తరుపున పాల్గొని విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

## నల్గొండ మహాత్మాగాంధీ

# యూనివర్సిటీలో తీవ్ర నీటి ఎద్దడి

**నల్గొండ** నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీ హాస్టళ్లలో గత నెల రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని విద్యార్థులు అందోళనకు దిగారు. పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమ సమస్యను పట్టించుకునే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. హాస్టళ్లలో నీళ్లు లేకపోవడంతో నెల రోజులుగా స్నానాలు కూడా చేయలేని పరిస్థితిలో వున్నామని అన్నారు.వెంటనే సమస్య పరిష్కారం చేయాలని తెల్లవారుజామున విద్యార్థులు హాస్టల్ వద్ద ఆందోళన కు దిగారు. స్పందించిన అధికారులు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయించారు. యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న కొత్త భవన నిర్మాణాలకు నీటిని మళ్లించడం వల్లే ఈ సమస్య తలెత్తిందని విద్యార్రదులు ఆరోపిస్తున్నారు.

## గ్యాస్ బండలను

# ఎత్తుకెళ్లేందుకు యత్నం

**హైదరాబాద్** గ్యాస్ ఆటో నుండి సిలిండర్లను వినియోగదారులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఫిలింనగర్ పరిధిలోని షేక్పేట్ వద్ద గ్యాస్ ఏజెన్సీ నుండి సిలిండర్లతో బయటికి వచ్చిన ఆటో నుండి అనుమతి లేకుండా సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని ఏజెన్సీ స్థానికుల సహాయంతో వారిని అడ్డుకున్నారు. గ్యాస్ బుక్ చేసి చాలా రోజులు గడుస్తున్నా ఇంకా సిలిండర్ రాలేదని వినియోగదారుల ఆగ్రహం.

# బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

### – బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**హైదరాబాద్** బీసీ సబ్ ప్లాన్ అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్ల కార్డ్స్ తో నిరసన కు దిగారు. ఈ నిరసన కార్యక్రమంలెఓ మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఎమ్మెల్యేలు పాల్గోన్నారు.మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్ లో 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడతామని చెప్పి మోసం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీ లను మోసం చేశారు. సిద్ధరామయ్యతో అబద్ధాలు చెప్పించి బీసీ ల ఓట్లు దండుకున్నారు. బీసీ సబ్ ప్లాన్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి ఏడాది 800 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని మోసం చేశారని ఆరో?పించారు.రెండో ఏడాది 11 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి , 3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. బీసీ లను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే టైం వచ్చింది. రాబోయే రోజుల్లో బీసీఅ లే కాంగ్రెస్ ప్రభుత్వంను బొంద పెడుతారు. లోకల్ బాడీ ఎలక్షన్ లో జనరల్ స్థానాల్లో బీసీ లు గెలిచారు, అది దేనికి సంకేతమో అర్థం చేసుకోవాలి. బీసీ విద్యార్థుల కోసం, ః అ గురుకులాలను పెద్ద ఎత్తున ఇచ్చిన ఘనత కేసీఆర్ ది. లింగయ్య యాదవ్ ను రాజ్యసభకు పంపించారు. అనేక మంది బీసీ నాయకులకు అత్యున్నత పదవులు ఇచ్చిన ఘనత కేసీఆర్ ది. కుల వృత్తులను ప్రోత్సహించన ఘనత కేసీఆర్ ది. 9 షెడ్యూల్ లో చేర్చకుండా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ పేరుతో మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను బీసీ లు గమనిస్తూనే ఉన్నారు, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ బొంద పెట్టడం ఖాయయని అన్నారు.

## విజయవాడ రైల్వే స్టేషన్‌లో

# భారీగా గంజాయి సీజ్

### – 8 మంది అరెస్టు..




**విజయవాడ** విజయవాడ రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పూరీ–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న ముందస్తు సమాచారంతో ఈగల్ మరియు ఆర్‌పీఎఫ్ (ఖీఖఈ) సిబ్బంది సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు.రైలులోని ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేయగా, సుమారు 65 కేజీల గంజాయి లభ్యమైంది. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న 8 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ముగ్గురు స్నేహితులకు 10 ఏళ్ల జైలు



**హన్మకొండ** గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన ముగ్గురు స్నేహితులకు హన్మకొండ న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. లక్ష్మణరావు, చైతన్య కుమార్, సైదులు ఆల్ప్రాజోలం మాత్రలతో కేజీ పొడిని తయారు చేసి న్యూఇయర్ వేడుకల్లో విక్రయించేందుకు 2023లో హైదరాబాద్ బయల్దేరగా, అప్పట్లో హన్మకొండ పోలీసులు వారిని పట్టుకున్నారు. ఆ కేసులో తాజాగా తీర్పు వెలువడింది.

## కూలీల ఆటో బోల్తా మహిళా మృతి....

ఉరవకొండ మండలం నింబగల్లు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హసీనా (45)అనే మహిళా మృతి చెందారు....మిరప కోతలకు 13మంది కూలీలతో వెళ్తున్న ఆటో, ఇసుక ట్రాక్టర్ ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది... ఈ ఘటనలో మరో పదిమందికి గాయాలయ్యాయి... బాధితులను చికిత్స నిమ్మితం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు...

## అమరావతి రాజధానిగా చట్టబద్ధత కోసమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు:

### – స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక అడుగు పడింది. ఈ నెల 28వ తేదీన (శనివారం) ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు ప్రకటించారు. అమరావతిని రాజధానిగా గుర్తించాలనే అంశంపై ఇప్పటివరకు చట్టపరమైన స్పష్టత లేదని, ఈ లోటును భర్తీ చేసేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విజయవాడ–అమరావతి ప్రాంతమే రాష్ట్ర రాజధానిగా ఉండాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు స్పీకర్ వివరించారు.?కేంద్ర ప్రభుత్వం కూడా అమరావతిని రాజధానిగా ఆమోదించిందని, అయితే పార్లమెంటులో బిల్లు పాస్ కావాల్సి ఉందని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు పార్లమెంటు సమావేశాలు ఉన్నందున, రాష్ట్ర అసెంబ్లీ చేసే తీర్మానాన్ని వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టం చేయించేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ చట్టం పూర్తయితే రాజధాని విషయంలో కొందరు చేస్తున్న విమర్శలకు శాశ్వతంగా తెరపడుతుందని స్పీకర్ స్పష్టం చేశారు. గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉత్తర్వుల మేరకు వెలగపూడిలోని అసెంబ్లీ హాల్‌లో ఈ ఆరో సెషన్ జరగనుంది.

## ఆపరేషన్ సిందూర్' మూవీ.. డైరెక్టర్ ఆయనే

'ఆపరేషన్ సిందూర్' మూవీ ఖరారైంది. 'ది కశ్మీర్ ఫైల్స్' ఫేమ్ వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో 'టీ సిరీస్' భూషణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఈ చిత్ర నిర్మాణంపై తాజాగా ప్రకటన విడుదలైంది. గతేడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ రాసిన బుక్ 'ఆపరేషన్ సిందూర్' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

# మే 4న ఏపీ లాసెట్ పరీక్ష

3 సంవత్సరాల ఒఒః వారికి ఉదయం, 5 సంవత్సరాల ఒఒః వారికి, పిజి లా ఒఒఓ వారికి మధ్యాహ్నం పరీక్ష.లేట్ ఫీజుతో వచ్చే నెల 6 వరకు దరఖాస్తుకు అవకాశం.అమరావతి: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో న్యాయవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ నిర్వహిస్తున్న ఏపీ లాసెట్–26 ప్రవేశ పరీక్ష మే 4న జరుగుతుందని లాసెట్ కన్వీనర్, మహిళా వర్సిటీ న్యాయ విభాగం ఆచార్యులు సీతాకుమారి బుధవారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు అపరాధ రుసుముతో వచ్చే నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో జరుగుతుందన్నారు. 3 సంవత్సరాల ఎల్ఎల్.బి అభ్యర్థులకు ఉదయం 9 నుంచి 10.30 వరకు, 5 సంవత్సరాల ఎల్.ఎల్.బి, రెండు సంవత్సరాల ఎల్ఎల్ఎం కోర్సు అభ్యర్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

# ప్రైవేటు బంకుల్లో ధరల పెంపు..

## వినియోగదారుల అందోళన

**నల్గొండ** ఉమ్మడి జిల్లా పరిధిలోని నయరా, జియో పెట్రోల్ బంక్ లలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. పెట్రోల్ లీటర్ కి 5, డీజిల్ లీటరుకి 3 రూపాయల చొప్పున పెంచారు. దాంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ బంకులో పెరగని ధర.. ప్రైవేట్ బంకులో పెరగటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

## విడాకులు తీసుకోబోతున్నట్టు

# వస్తున్న వార్తలపై

## ప్రియాంక చోప్రా స్పందన!



అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, తన వైవాహిక జీవితంపై సాగుతున్న నెగటివ్ ప్రచారానికి ముగింపు పలికారు. నిక్ జోనాస్‌తో ఆమె విడిపోతున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె కొట్టిపడేశారు. ఈ వార్తలు కేవలం కల్పితమని... దేశం, మతం, వయసు వంటి అంశాలను సాకుగా చూపి కొందరు విషప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. కేవలం ఆరు నెలల పరిచయంతోనే పెళ్లి చేసుకున్నప్పటికీ, తమ మధ్య ఉన్న గౌరవం, నిక్ చూపే నిజాయతీ ఈ ఎనిమిదేళ్ల ప్రయాణాన్ని ఎంతో మధురంగా మార్చాయని ప్రియాంక తెలిపారు. బయటి వ్యక్తుల అభిప్రాయాలు తమ బంధాన్ని ప్రభావితం చేయవని తేల్చి చెప్పారు. తన కుమార్తె మాల్తీ మేరీ ప్రైవసీ విషయంలో తాను చాలా కఠినంగా ఉంటానని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఫొటోలు తీయడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడం వంటివి తనకు నచ్చవని, అందుకే తన బిడ్డ భద్రత కోసం ప్రత్యేక సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. 30 ఏళ్ల వయసులో బాలీవుడ్‌లో టాప్ పొజిషన్‌లో ఉండి కూడా, అన్నీ వదిలేసి హాలీవుడ్‌లో సున్నా నుంచి మొదలుపెట్టడం ఒక పెద్ద సాహసమని ఆమె గుర్తు చేసుకున్నారు. మొదట్లో చిన్న పాత్రలే వచ్చినప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగానని... ఇప్పుడు తనకు నచ్చిన ప్రాజెక్టులను ఎంచుకునే స్థాయికి చేరుకున్నానని గర్వంగా చెప్పారు.

## ‘ధురంధర్2’ దెబ్బకు


# ‘పుష్ప2’ రికార్డులు గల్లంతు





రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్ 2’ బాక్సాఫీస్ వద్ద సంచలన రికార్డులు సృష్టిస్తోంది. సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ స్పై యాక్షన్ డ్రామా, విడుదలైన ఏడో రోజే సరికొత్త చరిత్ర సృష్టించి, ట్రేడ్ వర్గాలను విస్మయపరిచింది. కేవలం హిందీ వెర్షన్‌లో బుధవారం ఒక్కరోజే దాదాపు 47 కోట్ల రూపాయల వసూళ్లు సాధించి, మొదటి బుధవారం అత్యధిక కలెక్షన్లు రాబట్టిన ఇండియన్ సినిమాగా రికార్డులకెక్కింది. గతంలో ఏ హిందీ సినిమా కూడా ఈ స్థాయి ప్రభంజనాన్ని సృష్టించలేదు. పాత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి ‘ధురంధర్’ స్పీడ్‌కు బాక్సాఫీస్ రికార్డుల సమీకరణాలు మారిపోతున్నాయి. ఇప్పటివరకు మొదటి బుధవారం అత్యధిక వసూళ్లలో అగ్రస్థానంలో ఉన్న విక్కీ కౌశల్ హిస్టారికల్ మూవీ ‘ఛావా’ (రూ. 32.40 కోట్లు) ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయింది. అలాగే, సన్నీ డియోల్ నటించిన ‘గదర్ 2’ (రూ. 32.37 కోట్లు) మూడో స్థానానికి పరిమితమైంది. రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, ఆదిత్య ధర్ టేకింగ్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తుండటంతో పాత రికార్డులన్నీ తుడిచి పెట్టుకుపోతున్నాయి. అన్నింటికన్నా అతి పెద్ద ఆశ్చర్యం అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ రికార్డుల దెబ్బకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ‘పుష్ప 2’ టాప్-3 నుండి కిందికి పడిపోయింది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ‘పుష్ప 2: ది రూల్’ హిందీ వెర్షన్ రూ. 31.50 కోట్లు వసూలు చేసి మూడో స్థానంలో ఉండేది, కానీ ఇప్పుడు ధురంధర్ 2 ధాటికి నాలుగో స్థానానికి పడిపోయింది. రణ్‌బీర్ కపూర్ నటించిన ‘యానిమల్’ (రూ. 30.45 కోట్లు) ఈ జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతోంది. పుష్ప వంటి భారీ పాన్-ఇండియా సినిమా రికార్డునే రణ్‌వీర్ సింగ్ బ్రేక్ చేయడం ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొత్తానికి, ‘ధురంధర్ 2’ కేవలం ఒక స్పై థ్రిల్లర్‌గానే కాకుండా బాక్సాఫీస్ వద్ద ఒక కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా సాధిస్తున్న కలెక్షన్ల లెక్కలు చూస్తుంటే, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ రికార్డులను తిరగరాయడం ఖాయమనిపిస్తోంది. లాంగ్ రన్‌లో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## నవ్వులు పూయిస్తూనే భయపెడుతున్న ‘రాకాస’..




‘మ్యాడ్’, ‘మ్యాడ్ స్క్వేర్’ సినిమాలతో యూత్ లో క్రేజ్ సంపాదించుకున్న యంగ్ హీరో సంగీత్ శోభన్ సోలో హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘రాకాస’. జీ స్టూడియోస్ సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ బుధవారం ఘనంగా విడుదలైంది. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా హారర్, కామెడీ, ఫాంటసీ అంశాల కలయికతో రూపొందింది. అమెరికా నుంచి ఒక కుర్రాడు (సంగీత్ శోభన్) తన ఊరికి తిరిగి వచ్చినప్పుడు, అక్కడి ఒక పాడుబడ్డ కోట వెనుక ఉన్న మిస్టరీలో ఎలా చిక్కుకున్నాడనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. ఊరు మొత్తం కలిసి ఒక బ్రహ్మరాక్షసుడికి హీరోను బలి ఇవ్వాలని చూడటం, ఆ విపత్కర పరిస్థితుల నుంచి హీరో తన కామెడీ టైమింగ్‌తో ఎలా తప్పించుకున్నాడనేది సినిమాలో ప్రధానాకర్షణగా నిలవనుంది. వెన్నెల కిశోర్, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ‘కమిటీ కుర్రాళ్లు’ సినిమాతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ఈ ‘రాకాస’తో మరో హిట్ కొట్టాలని భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## ఆదర్శ కుటుంబంలో

# బుట్టబొమ్మ..

## - పూజా హెగ్డేకి త్రివిక్రమ్ మళ్లీ ఛాన్స్ ఇస్తున్నారా?



విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ‘ఆదర్శ కుటుంబం - AK 47’. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్ గ నటిస్తుండగా.. పూజా హెగ్డే కూడా ఈ మూవీలో భాగం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో పూజాతో ‘అరవింద సమేత వీర రాఘవ’, ‘అల వైకుంఠపురంలో’ సినిమాలు చేసిన త్రివిక్రమ్.. మరోసారి ఆమెతో వర్క్ చేయబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది.‘సంక్రాంతికి వస్తున్నాం’ తర్వాత విక్టరీ వెంకటేష్ నటిస్తున్న సినిమా ‘ ఆదర్శ కుటుంబం - AK 47’. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి భారీ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేశారు. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఈ సినిమాలో పూజా హెగ్డే కూడా భాగం కాబోతున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో పూజా హెగ్డే పలు చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది. వీరికలయికలో వచ్చిన ‘అరవింద సమేత వీర రాఘవ’, ‘అల వైకుంఠపురంలో’ సినిమాలు రెండూ బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించాయి. ‘గుంటూరు కారం’ సినిమాలోనూ బుట్టబొమ్మనే నటించాల్సింది కానీ.. చివరి నిమిషంలో ఆమెను తప్పించారు. పూజానే తప్పుకుందా, మేకర్స్ తప్పించిందా అనే సంగతి తెలియదు కానీ.. ఆ తర్వాత ఆమెకు తెలుగులో అవకాశాలు కరువయ్యాయి. అయితే మళ్లీ ఇన్నాళ్లకు త్రివిక్రమ్ మరోసారి పూజాకి ఛాన్స్ ఇవ్వబోతున్నారని టాక్ వినిపిస్తోంది.ఆదర్శ కుటుంబం సినిమా కోసం పూజాహెగ్డే పేరును పరిశీలిస్తున్నారట త్రివిక్రమ్. ఇందులో శ్రీనిధి శెట్టి మెయిన్ హీరోయిన్ కాగా.. ఓ స్పెషల్ సాంగ్‌ను పూజాహెగ్డేతో ప్లాన్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. త్రివిక్రమ్ గతంలో ఇలియానా, సమంత వంటి హీరోయిన్లను తన సినిమాల్లో రిపీట్ చేశారు. ఈ క్రమంలో ఇప్పుడు పూజా హెగ్డేని కూడా రిపీట్ చేస్తున్నారని అంటున్నారు. ఇందులో నిజమెంతనేది తెలియాలంటే, అధికారిక ప్రకటన వచ్చే వరకూ ఆగాల్సిందే.ఇకపోతే ఈ మూవీలో నారా రోహిత్ నటిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. నెగెటివ్ షేడ్స్ ఉన్న పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని, ఇది కథలో చాలా కీలకమైన రోల్ అని చెప్పుకుంటున్నారు. ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47’ చిత్రాన్ని హారిక ః హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ(చినబాబు) నిర్మిస్తున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. రవి కె.చంద్రన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారని సమాచారం.వెంకటేష్ - త్రివిక్రమ్ సినిమాని 2026 సమ్మర్ లో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ ఏడాది సెకండాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇటీవలే కీలకమైన షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేశారు, దీని కోసం అన్నపూర్ణ స్టూడియోస్ లో భారీ సెట్ నిర్మించినట్లు టాక్. ఇప్పటికే రిలీజైన టైటిల్ ః ఫస్ట్ లుక్ పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంది.

## రామ్‌చరణ్ కంటికి స్వల్ప సర్జరీ



’పెద్ది’ సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు.డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి ’పెద్ది’ షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఆకట్టుకుంటున్న తిరువీర్ కొత్త సినిమా టీజర్

‘మసూద’, ‘పరేషాన్’ ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్’ వంటి వైవిధ్యమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘పాపం ప్రతాప్’. ఏ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్ర టీజర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఒక సామాన్యమైన వ్యక్తి జీవితంలో ఎదురయ్యే వింతైన, వినోదాత్మకమైన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. టైటిల్‌కు తగ్గట్టే హీరో ‘ప్రతాప్’ పడే కష్టాలు, చుట్టూ ఉన్న పరిస్థితులు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సహజసిద్ధమైన నటనతో ఆకట్టుకునే తిరువీర్, ఈ సినిమాలో కూడా తనదైన మేనరిజమ్స్‌తో మరోసారి మెప్పించనున్నాడు. టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమా మూడ్‌ను చక్కగా ఎలివేట్ చేశాయి. కేవలం వినోదం మాత్రమే కాకుండా, కథలో ఏదో బలమైన పాయింట్ ఉందనే సంకేతాన్ని టీజర్ ఇస్తోంది. ప్రస్తుతం అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎస్.పీ దుర్గ నరేష్ దర్శకత్వం వహిస్తుండగా.. రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాయల్ రాధకృష్ణ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుంది.




PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154